సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం ၊ 15 ၊ మే ၊ 2024



నమో వీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠంలోని వీరబ్రహ్మ క్షేత్రంలో మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజోత్సవాలు మంగళ వారం వైభవంగా ప్రారంభమయ్యాయి. -8లో



రాజంపేట సెంటిమెంట్ ఎవరికో!

రాజంపేట నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ ఉంది. సెంటిమెంట్ ఎవరికి లాభిస్తుందో చూడాలి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.50	రూ.194
రెండోరకం	రూ.100	రూ.140

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 405 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

23న దేవరరాయి నల్లగంగమ్మ తిరునాల



జాతరను పురస్కరించుకొని ఊరేగింపు వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సంబేపల్లె: మండల పరిధిలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మతల్లి జాతర ఈనెల 23వ తేదీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు వాహనం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీలో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్మీడియేట్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయి 18–26 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. 35 రోజుల పాటు కొనసాగే శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ శిక్షణతోపాటు కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణానంతరం ప్రతిభను బట్టి ఉపాధి కల్పిస్తామని, ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

17న జిల్లాస్థాయి మహిళల క్రికెట్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలోని నెట్స్ కేంద్రంలో ఈనెల 17వ తేదీ ఉదయం 7 గంటలకు జిల్లాస్థాయి అండర్–23, అండర్–19, అండర్–15 మహిళల విభాగం క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. అండర్–23 విభాగంలో పాల్గొనే క్రీడాకారిణులు 01-09-2001 తర్వాత పుట్టినవారై ఉండాలని పేర్కొన్నారు. అండర్–19 విభాగానికి 01-09-2005 తర్వాత, అండర్–15 విభాగానికి 01-09-2009 తర్వాత పుట్టినవారై ఉండాలని సూచించారు. ఆసక్తి గల క్రీడాకారిణులు ఆధార్‌కార్డు, బర్త్‌సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్, పదోతరగతి మార్కులిస్టుల ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒకసెట్ జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని సూచించారు. క్రికెట్ కిట్ బ్యాగులు వెంట తెచ్చుకోవాలని కోరారు.

24న గోవాకు ప్రత్యేక బస్సు



కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో నుంచి ఈనెల 24వ తేది మధ్యాహ్నం 3 గంటలకు ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గోవాకు ప్రత్యేక ఇంద్ర ఏసీ బస్సు సర్వీసు (50301)ను నడపనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు సర్వీసులో పెద్దలకు రూ.3300, పిల్లలకు రూ. 2000లుగా నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ బస్సు సర్వీసుకు సంబంధించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీఎస్ఆర్‌టీసీఆన్‌లైన్.ఇన్ లేదా కడప ఆర్టీసీ బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్ ద్వారా టిక్కెట్లను పొందవచ్చన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ జిల్లాల్లోని నిరుద్యోగ యువతులకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ, హెచ్ఎస్‌బీసీ సహకారంతో హైదరాబాదులోని ప్రథం హెల్త్ కేర్ శిక్షణ కేంద్రంలో రెండు నెలలపాటు నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సరిత తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి వంద శాతం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. 18–30 ఏళ్లలోపు ఉండి టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, డిప్లొమా లేదా ఏదైనా ఒకేషనల్ కోర్సు చదివి ఉండాలన్నారు. అర్హులు ఆధార్‌కార్డు, 10వ తరగతి మెమో జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఉపాధి ఆధారిత శిక్షణా కార్యక్రమాలకు అర్హత, ఆసక్తిగల గ్రామీణ, పట్టణ ప్రాంత అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి సౌకర్యం, స్టడీ మెటీరియల్, ఒక జత యూనిఫాం ఉచితమన్నారు. ఇతర వివరాలకు 90002 03952 నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.



ఫ్యాన్స్‌లో జోష్!

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పదికి పది సీట్లు ఖాయమంటున్న విశ్లేషకులు
- ఫ్యాన్ వైపే మొగ్గు చూపిన గ్రామీణ ఓటర్లు
- కడప గడపలో టీడీపీ ఆశలు గల్లంతే!



సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ సీపీ అభిమానుల్లో ఫుల్ జోష్ కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికలల్లో వైఎస్సార్‌సీపీ రికార్డులు తిరగరాయనున్న నేపథ్యంలో ఆ పార్టీలో ఉత్సాహం ఉరకలేస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలో వైఎస్సార్‌సీపీ పదికి పది సీట్లు సాధించి, ఐదుగురికి హ్యాట్రిక్ రికార్డు కట్టబెట్టనుందా? గ్రామీణ ఓటర్లు ఏకపక్షంగా తీర్పు అప్పగించనున్నారా?.. అరకొరగా ఉన్న టీడీపీ ఆశలు ఆవిరి అయ్యాయా?.. పుత్తా, పుట్టాకు మరోమారు చేదు అనుభవం తప్పదా..? వయో వృద్ధుడు వరదకు ఈసారీ ఆశాభంగం తప్పదా? .. అంటే.. విశ్లేషకుల నుంచి అవుననే సమాధానమే వినిపిస్తోంది. రాజంపేట, కడప పార్లమెంటు పరిధిలో ఒక్క అసెంబ్లీ సీటు కూడా టీడీపీ ఖాతాలో పడే అవకాశమే లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు..

ఎన్నికలకు నోటిఫికేషన్ ఖరారు కాకముందు నుంచే తెలుగుదేశం పార్టీ, ఎల్లో మీడియా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల వ్యక్తిత్వ హననానికి పాల్పడింది. ఓటర్లు చెవులు తూట్లు పడేలా దుష్ప్రచారం చేపట్టారు. పోలింగ్‌లో ఇవేవి పట్టించుకోకుండా ఓటర్లు తీర్పు కట్టబెట్టారు. 'ఈ ఐదేళ్లలో నా పాలనలో లబ్ధి చేకూరింటేనే నాకు ఓట్లు వేయండి, మీ చుట్టు పక్కల వారికి చెప్పి ఓట్లు వేయించండ'ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పీల్ చేశారు. రాష్ట్రం నలుమూలల తిరుగుతూ మీకు మంచి చేసింటేనే ఓట్లు వేయాలని కోరారు. ఇలా అడిగిన దమ్మున్న నాయకుడు చరిత్రలో లేరని రాజకీయ విశ్లేషకుల మాట. మరోవైపు చంద్రబాబు అండ్‌కో అమలు కానీ హామీలు ఇస్తోందని, ఇదే కూటమి 2014లో 600 పైగా హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సవివరంగా వివరిస్తూ, చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని కూడా చెప్పారు. ఇలాంటి విషయాలన్నీ బేరీజు వేసుకున్న గ్రామీణ ఓటర్లు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారు. వీరిలో మహిళల మద్దతు పాళ్లు మరింత ఎక్కువగా ఉందని పరిశీలకుల అంచనాకు వచ్చా రు. కాగా, ఉద్యోగుల్లో మాత్రమే టీడీపీకి మెరుగైన అవకాశం ఉందని, అయితే అభ్యర్థుల గెలుపోటములు డిసైడ్ చేయదగ్గ స్థాయిలో లేవని కూడా వివరిస్తున్నారు.

ఓటమికి ముందే సాకులు వెతుకుతున్న వాసు

కడప గడపలో ఈమారు ఎలాగైనా గెలవాలనే దృక్పథంతో టీడీపీ పనిచేసింది. ఇన్‌చార్జిగా మాధవీరెడ్డి నియామకం తర్వాత పథకం ప్రకారం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ వచ్చారు. మరోవైపు విద్వేషాలను రెచ్చగొట్టి సొమ్ము చేసుకోవాలని అడుగులేశారు. పోలింగ్‌లో ఇవేవీ కన్పించడం లేదని పరిశీలకులు భావిస్తున్నారు. నగరంలో మాస్ ఓటర్లు ఉదయం నుంచే గణనీయంగా పాల్గొన్నారు. సాయంత్రం వరకూ మాస్ పోలింగ్ కన్పిస్తూ వచ్చింది. మిడిల్, అప్పర్ క్లాస్ ఓటర్లు పోలింగ్‌లో తక్కువగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీకి ఓటింగ్ సరళి సానుకూలంగా మారింది. తెలుగుదేశం పార్టీ ఊహించిన వర్గం ఓటర్లు పోలింగ్‌లో తక్కువగా పాల్గొన్నారు. వెరసి టీడీపీ ఓటమి ఖాయమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్టీ వెన్నుపోటుదారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని పరోక్షంగా ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డికి హెచ్చరికలు పంపారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్‌బీ అంజాద్‌బాషా దొంగ ఓట్లుకు పాల్పడుతుంటే అడ్డుకున్నామని ఆరోపించారు. కడపలో టీడీపీ తీరు చూస్తుంటే ఓటమికి ముందే సాకులు వెతికే పనిలో నిమగ్నమైనట్లు స్పష్టమౌతోందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఐదుగురికి హ్యాట్రిక్

ఉమ్మడి కడప జిల్లాలో 2024 ఎన్నికల ఫలితాలల్లో ఐదుగురికి హ్యాట్రిక్ దక్కనున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇప్పటికే వరుసగా రెండుసార్లు గెలుపొందిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఎస్‌బీ అంజాద్ భాషా, రాచమల్లు శివప్రసాదరెడ్డిలు విజయం సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకునే దశలో ఉన్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ప్రజాతీర్పు అందుకు అనుగుణంగా ఉన్నట్లు జిల్లా వాసులు భావిస్తున్నారు.

వరదకు ఆశాభంగం


చివరి అవకాశం కల్పించాలని ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి విన్నవించినా ఆశాభంగం తప్పడం లేదు. దాదాపు 80శాతం ఓటింగ్ నమోదు కావడం వెనుక పోల్ మేనేజ్‌మెంట్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉన్నట్లుగా పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఓటింగ్ సరళిని బట్టి మరోమారు ఎమ్మెల్యేగా అవకాశం దక్కనున్నట్లు రాచమల్లు శివప్రసాద రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. రాజంపేటలో స్థానికుడైన ఆకేపాటి అమర్‌నాథరెడ్డి విజయం నల్లేరుపై నడకేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. రాయచోటికి చెందిన బాలసుబ్రమణ్యంను పోటీ చేయించడమే టీడీపీ చేసిన అతిపెద్ద పొరపాటుగా పలువురు వివరిస్తున్నారు. రైల్వేకోడూరు, బద్వేల్, జమ్మలమడుగు నియోజకవర్గాలు ఎన్నికల పొత్తులో భాగంగా జనసేన, బీజేపీలకు కేటాయిడం మరో పెద్ద తప్పిదంగా పలువురు వివరిస్తున్నారు. ఆ మూడు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీకి ఎదురు లేకుండా పోయిందని విశ్లేషకులు భావిస్తున్నారు. పులివెందులలో సీఎం వైఎస్ జగన్, రాయచోటిలో శ్రీకాంత్‌రెడ్డి విజయానికి ఎలాంటి ఢోకా లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అక్కడ మెజార్టీపైనే లెక్కల చర్చలు సాగుతున్నాయి.

పుట్టా...పుత్తాకు చేదు అనుభవం

'అందని ద్రాక్ష పుల్లనా' అన్నట్లుగా మైదుకూరు, కమలాపురం తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా చైతన్యరెడ్డిల పరిస్థితి ఉత్పన్నం కానున్నట్లు సమాచారం. ఎన్నికలకు ముందు నుంచి ఉన్న అంచనాలు పోలింగ్‌లో తలకిందులయ్యాయి. చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలు రద్దు అయితాయనే భావనతోనే గ్రామాల్లో సామాన్య మహిళలు, వృద్ధులు, మైనార్టీలు పోలింగ్‌లో పోటాపోటీగా పాల్గొన్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క అవకాశం ఇవ్వాలన్న పుట్టా సుధాకర్ యాదవ్‌కు అనువుగా ఓటింగ్ కొనసాగలేదనే భావనే మైదుకూరులో వ్యక్తమౌతోంది. రెడ్డి, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఓటర్లు అత్యధికంగా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని పలువురు వివరిస్తున్నారు. కమలాపురం టీడీపీ అభ్యర్థిగా పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పోటీ చేశారు. వరసగా నాలుగు పర్యాయాలు ఈయన తండ్రి పుత్తా నరసింహారెడ్డి ఇక్కడి నుంచి ఓడిపోయారు. సానుభూతి వ్యక్తం అవుతోందనుకున్న తరుణంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని మార్పు చేసింది. ఈ పరిణామం పార్టీకి నష్టం చేసిందనే చెప్పాలి. మరోవైపు మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, సాయినాథశర్మ ఫ్యాక్టర్ వైఎస్సార్‌సీపీకి కలిసి వచ్చింది. ఎన్నికలు దగ్గర పడే కొద్ది వైఎస్సార్‌సీపీ ఊపు మీదకు వచ్చింది. వల్లూరు, చెన్నూరు, చింతకొమ్మదిన్నె, కమలాపురం మండలాలపై టీడీపీ పెట్టుకున్న ఆశలు ఆవిరి అయ్యాయి. మరోవైపు పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలాలు వైఎస్సార్‌సీపీ ఆధిపత్యం మరోమారు నిరూపితం కానుంది. ఆ నాలుగు మండలాలల్లో కూడా పైచేయి సాధించే దిశగా వైఎస్సార్‌సీపీ వ్యవహారాలు నడిపింది. వెరసి కమలాపురం ఓటర్లు మరోమారు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పోచం రెడ్డి రవీంద్రనాథరెడ్డికి విజయం కట్టబెట్టనున్నట్లు ఆయా వర్గాలు వెల్లడిస్తున్నాయి.

రైతన్నకు చల్లని కబురు

- తొలకరి వర్షాలపై వాతావరణశాఖ సానుకూల సమాచారం
- నైరుతిపైనే ఖరీఫ్ ఆశలు
- వర్షాధార పంటల సాగుకు దుక్కులు చేసేందుకు సిద్ధమైన రైతులు



ఆకాశం మేఘావృతమైన దృశ్యం

రాయచోటి: భిన్న వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్న అన్నమయ్య జిల్లా ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. మరో నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు అండమాన్ తీరాన్ని తాకుతాయని తెలపడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులలో సాగుపై ఆశలు చిగురించాయి. ద్రోణి ప్రభావం కారణంగా అడపా దడపా పడుతున్న తొలకరి వర్షాలకు మెట్ట భూములలో దుక్కులు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత ఏడాది తగినంత వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలలో చుక్కనీరు లేకుండా వట్టిపోయాయి. బోరు బావుల్లో నీరు అడుగుకు చేరుకుంది. దీంతో చాలా గ్రామాలలో తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫలితంగా నీటి ట్యాంకర్ల ద్వారా ఆయా గ్రామాలలో తాగునీటి అవసరాలను తీరుస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నైరుతు రుతు పవనాల కారణంగా అల్పపీడన ద్రోణి బలపడుతుండడంతో మేఘాలు పరుగులు తీస్తున్నాయి. అక్కడక్కడా వర్షపు జల్లులు కురుస్తుండడం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు శుభసూచకంగా చెబుతున్నారు. జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ చెబుతోంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈనెల 16 నుంచి 21 మధ్య విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందన్న సమాచారంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ప్రధానంగా ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, అలసంద, ఆముదం, అనప, జొన్న, సజ్జ పంటలను అధికంగా సాగు చేస్తారు.

రేపటి నుంచి ఈఏపీసెట్

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ
- 16,17న బైపీసీ విభాగానికి.. 18 నుంచి 23 వరకు ఎంపీసీ విభాగానికి పరీక్ష
- జిల్లా వ్యాప్తంగా ఇంజినీరింగ్ పరీక్షకు మొత్తం విద్యార్థులు 15,461
- అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు మొత్తం విద్యార్థులు 4962
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కడపలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్న అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల

కడప ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష(ఏపీ ఈఏపీసెట్)– 2024 గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానుంది. సంబంధిత పరీక్షలను కంప్యూటర్ ఆధారిత(ఆన్‌లైన్)విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా అగ్రికల్చర్, ఫార్మసీ(బైపీసీ) విద్యార్థులకు ఈనెల 16, 17 తేదీలలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనుండగా ఇంజినీరింగ్ స్ట్రీమ్ (ఎంపీసీ) విద్యార్థులకు 18 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. ఇందులో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో 15,461 మంది ఇంజినీరింగ్‌కు, 4962 మంది అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షను ఆన్‌లైన్‌లో రాయనున్నారు. ఇందులో ఉదయం సెషన్ 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు, అలాగే మధ్యాహ్నం సెషన్‌కు 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహించనున్నారు.

జిల్లాలో పరీక్షా కేంద్ర వివరాలు ఇలా..

ఈఏపీసెట్ పరీక్ష కోసం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో తొమ్మిది పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో కడపలో ఐదు పరీక్షా కేంద్రాలున్నాయి. అవి కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం, కేఓఆర్ఎం, అన్నమాచార్య, శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల. అలాగే ప్రొద్దుటూరులో రెండు పరీక్షా కేంద్రాలను కేటాయించారు. అవి చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ, సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల. అలాగే రాజంపేటలో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలను, రాయచోటిలో భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ కళాశాలను పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించారు.

గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలి



విద్యార్థులను ఉదయం సెషన్‌కు సంబంధించి 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు 1 గంట నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తింపు కార్డు తప్పని సరిగా వెంట తీసుకురావాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరీక్ష రోజే కులధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది.

ఈవీఎంలో భవితవ్యం

- 13న ముగిసిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- జిల్లాలో 77.80 శాతం పోలింగ్ నమోదు
- తంబళ్లపల్లె నియోజకవర్గంలో రాత్రి 11.45 వరకు కొనసాగిన పోలింగ్
- ప్రత్యేక వాహనాల ద్వారా రాయచోటికి ఈవీఎంల తరలింపు
- జూన్ 4న ఎంపీ, ఎమ్మెల్యేల స్థానాలకు కౌంటింగ్



రాయచోటిలోని స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

సాక్షి, రాయచోటి: అన్నమయ్య జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు సోమవారం ముగియడంతో ఇక అందరి దృష్టి ఫలితాలపై పడింది. అభ్యర్థుల భవిష్యత్తు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఫలితాలపై అభ్యర్థులతో పాటు ఓటర్లలో కూడా ఉత్కంఠ నెలకొంది. గెలుపు ఎవరిని వరిస్తుందనే విషయంపై ఎవరి అంచనాల్లో వారు తలమునకలయ్యారు. గతంలో ఎప్పుడు చూసినా 65–75 శాతం మాత్రమే పోలింగ్ నమోదయ్యేది. ఇప్పుడు ఓటింగ్ శాతం అనూహ్యంగా 78 శాతానికి పైగా పెరగడంతో ఇదంతా ప్రభుత్వ సానుకూల ఓటింగ్ అనే అధికార వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా పట్టణాల కంటే పల్లెల్లోనే ఓటింగ్ శాతం ఎక్కువ నమోదు కావడం ఒక ఎత్తయితే, మహిళలు, వృద్ధులు, నూతన ఓటర్లు ఇలా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం భారీగా పెరిగింది.జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎన్నికలు నిర్వహించారు.

తంబళ్లపల్లె సెగ్మెంట్‌లో రాత్రి 11.45 వరకు పోలింగ్

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో భారీగా పోలింగ్ నమోదైంది. కాకపోతే సోమవారం సాయంత్రం గాలులు, వర్షం రావడంతో చాలామంది క్యూలైన్‌లోఉన్నా ఇంటికి వెనుదిరిగారు. తర్వాత గాలులు, వర్షం తగ్గడంతో తిరిగి 5.45 గంటల ప్రాంతంలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ములకలచెరువు, కురబలకోట మండలాల్లో కూడా రాత్రి కూడా క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ బూత్ నెంబరు 212లో రాత్రి 11.45 గంటల వరకు పోలింగ్ నమోదైంది. క్యూలైన్‌లో ఉన్న అందరికీ ఓటు వేసుకునే అవకాశాన్ని అధికారులు కల్పించారు. ఇదిలా ఉండగా ఓటర్ల విషయానికి వస్తే జిల్లా వ్యాప్తంగా 14,26,834 మంది ఉండగా, అందులో పురుషులు 7,00,380 మందికాగా, మహిళలు 7,26,327 మంది, ఇతరులు 127 మంది ఉన్నారు. జిల్లాలో 77.80 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ సరళిపై చర్చ

పోలింగ్ ముగియడంతో జిల్లాలో ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపై చర్చ జరుగుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులు పోలింగ్ సరళిని విశ్లేషించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పలు ప్రధాన పార్టీల అభ్యర్థులు పార్టీ ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఓటింగ్ తీరుతెన్నులతో పాటు విజయావకాశాలను విశ్లేషించుకుంటున్నారు.

రాయచోటిలోని స్ట్రాంగ్ రూముకు ఈవీఎంలు

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను అధికారులు పోలీసుల పటిష్ట భద్రత మధ్య రాయచోటికి తీసుకు వచ్చారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో ఈవీఎంలను భద్రపరిచారు. స్ట్రాంగ్ రూముల పరిసరాల్లో మూడంచెల భద్రతతోపాటు సమీప ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఎస్పీ బి.కృష్ణారావులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల అధికారులతోపాటు పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూములవద్ద ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, పటిష్ట భద్రతా చర్యలు చేపట్టా లని ఆదేశించారు. ఎవరినీ లోనికి అనుమతించరాదని సూచించారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ ప్రారంభమయ్యే వరకు భద్రతా చర్యలు కొనసాగుతాయన్నారు.

4న ఎన్నికల కౌంటింగ్

అన్నమయ్య జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలతో పాటు రాజంపేట లోక్‌సభ స్థానానికి సంబంధించి జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు అనంతరం ఈవీఎంలలోని ఓట్లను లెక్కించనున్నారు.

స్ట్రాంగ్ రూములలో భద్రమైన ఈవీఎంలు

రాయచోటి: స్ట్రాంగ్ రూములలో పోల్డ్ ఈవీఎంలను పకడ్బందీగా భద్రపరిచామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిషోర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎన్నికల పరిశీలకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన ఈవీఎంలను శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములలో పకడ్బందీగా భద్రపరిచి సీల్ వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని పార్లమెంటు, అసెంబ్లీకి సంబంధించి నియోజకవర్గాల వారీగా రాజంపేట, కోడూరు, రాయచోటి, తంబళ్లపల్లి, పీలేరు, మదనపల్లి ఆరు నియోజకవర్గాలకు సంబంధించిన పోల్డ్ ఈవీఎంలను శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి సీల్ వేశామన్నారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ సందర్భంగా అదే రోజు ఉదయం పరిశీలకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో సీల్ తొలగించి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. అంతవరకు స్ట్రాంగ్ రూముల దగ్గర అత్యంత పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాల ఘర్షణ
– కేసు నమోదు

చిన్నమండెం : మండలంలోని కొత్తపల్లె గ్రామం శ్రీనివాసపురంలో కుటుంబ సమస్యలతో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

కానిస్టేబుల్‌కు గాయాలు



ప్రమాదంలో గాయపడిన కలాం బాషా

సిద్దవటం : రోడ్డు ప్రమాదంలో ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కానిస్టేబుల్ కలాం భాషాకు గాయాలయ్యాయి. సిద్దవటం మండలం భాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కానిస్టేబుల్ కలాం బాషా స్థానిక ఏజీ–1 గార్డు రూమ్ ఎదురుగా ఉన్న హోటల్ నుంచి భోజనం పార్సిల్ తీసుకువస్తున్నారు. ద్విచక్ర వాహనంలో రోడ్డు దాటుతుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన మారుతీ ఓమిని వ్యాన్ కానిస్టేబుల్ కలాంభాషా వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్‌ను అంబులెన్స్‌లో కడపకు తరలించారు.

కోళ్ల ఫారంపై కూలిన చెట్టు
– రూ.3 లక్షలకు పైగా నష్టం



మృతి చెందిన కోళ్లు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రానికి సమీపంలోని బోడిగుట్ట వద్ద షెడ్డు కూలి కోళ్లు మృతి చెందాయి. పెద్దతిప్పసముద్రానికి చెందిన ఎల్.రజీవుల్లా కుటుంబ సభ్యులు కోళ్ల ఫారం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి కురిసిన గాలివానకు ఓ చెట్టు కూలి సమీపంలోని కోళ్ల ఫారంపై పడింది. అక్కడి షెడ్డు గోడ నేలకొరగడంతో ఫారంలోని కోళ్లు మృతి చెందాయి. ఈ ఘటనలో రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని కుటుంబీకులు కంటతడిపెట్టారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని బాధితులు కోరారు.

చిన్నగురువళూరు ఘటనలో 10 మందిపై కేసు నమోదు

చాపాడు : సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మండలంలోని చిన్నగురువళూరులోని పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన ఘర్షణ కేసులో 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఆర్‌వీ.కొండారెడ్డి తెలిపారు. టీడీపీ ఏజెంట్‌గా ఉన్న ఉగ్ర నరసింహులు, వైఎస్సార్‌సీపీ ఏజెంట్ల నడుమ వాగ్వివాదం చిలికి చిలికి గాలివానలా మారి ఈ ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సంఘటనలో నరసింహులు గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితోపాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాజంపేట సెంటిమెంట్ ఎవరికో!

- గెలిచే అభ్యర్థిదే రాష్ట్రంలో అధికారం
- సుదీర్ఘ కాలంగా ఆనవాయితీగా వస్తున్న వైనం
- పోలింగ్ వైఎస్సార్‌సీపీ అనుకూల మేనన్న పరిశీలకులు
- పీవీ.మిథున్‌రెడ్డి, ఆకేపాటికి గెలుపు పవనాలు



పీవీ మిథున్‌రెడ్డి



ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి





రాజంపేట : ఒకొక్క నియోజకవర్గానికి ఒక్కో ప్రత్యేకత. కొందరు నాయకులు గెలిచినా పార్టీలు ఓడిపోవడం, కొందరు ఓడినా.. మరిన్ని చోట్ల అదే పార్టీ అధికారంలో రావడం చూస్తుంటాం. కానీ రాజంపేట నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఏ పార్టీ అభ్యర్థి అయితే అక్కడ గెలుపొందుతాడో ఆ పార్టీ అధికారంలోకి వచ్చే సంప్రదాయం కొనసాగుతోంది. 2024లో కూడా సెంటిమెంట్ ఎవరికో.. అన్నది ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మెజార్టీ దిశగా...

పోలింగ్ సరళినిబట్టి ఎంపీ అభ్యర్థి పీవీ.మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిల గెలుపునకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పరిశీలకులు అంచనాకు వచ్చారు. గత ఎన్నికల తరహాలోనే ఈ సెంటిమెంట్ దక్కే పరిస్థితులున్నాయని పోలింగ్ సరళిని బట్టి రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. మహిళల ఓటింగ్ భారీగా పెరగడంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడి సంక్షేమం గాలి వీసినట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. మెజార్టీపై అంచనాలు వేసుకుంటున్నారు.

1985 నుంచి ,...

గత 34 యేళ్లుగా నియోజకవర్గ పరిశీలనలోకి వెళితే..రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పార్టీ అధికారంలోకి వస్తోంది. ఉభయ జిల్లా వ్యాప్తంగా ఈ నియోజకవర్గ అభ్యర్థి గెలుపు వ్యవహారాలు ఆసక్తిని కలిగిస్తాయి. 1985 నుంచి గెలిచిన అభ్యర్థికి సంబంధించి పార్టీ అధికారం చేపడుతూ వస్తోంది. దాదాపు 34 యేళ్లుగా ఇక్కడ అభ్యర్థి గెలవడం, ఆ పార్టీ అధికారంలోకి రావడం చూసి జనం సంప్రదాయంగా భావిస్తున్నారు. ఏళ్ల చరిత్రలో ఇది కూడా ఓ మైలురాయిగానే చెప్పుకోవచ్చు. అనేకమంది అభ్యర్థులు కూడా పోటీపడిన చరిత్రలు కూడా నియోజకవర్గంలో ఉన్నాయి.

1985లో టీడీపీ తరుపున బీ.రత్నాసభాపతి, 1989లో కాంగ్రెస్ నుంచి కే.మదన్‌మోహన్‌రెడ్డి, 1994, 1999లో టీడీపీ అభ్యర్థిగా పసుపులేటి బ్రహ్మయ్య గెలుపొందారు. ఆ పార్టీ అధికారం చేపట్టింది. 2004లో టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందారు. అప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చింది.

నాడు వైఎస్సార్ హయాంలో.. నేడు జగనన్న హయాంలో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలోనూ, నేడు జగనన్న హయాంలోనూ వైఎస్సార్‌సీపీ రాజ్యమేలుతోంది. 2004లో కొండూరు ప్రభావతమ్మ గెలుపొందారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, డా.వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం జరిగింది. 2009లో ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. మరోమారు వైఎస్సార్ సీఎం పీఠం అధిరోహించారు. 2012లో ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి 30వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. 2014లో టీడీపీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి గెలుపొందారు. అప్పటి టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2019లో వైఎస్సార్‌సీపీ తరపున మేడామల్లికార్జునరెడ్డి గెలుపొందారు. ఈ క్రమంలో సంప్రదాయం కొనసా వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీ సాధించింది. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా ముఖ్యమంత్రి అయ్యారు. వైఎస్సార్ కుటుంబానికి అగ్రపీఠం అందజేస్తున్న నియోజక వర్గంగా రాజంపేట చరిత్రలో నిలిచిపోయింది.

రాళ్లదాడి ఘటనలో ఇరువర్గాలపై కేసులు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌస్ నగర్ దేవుని కడప రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రాళ్లదాడి ఘటనలో ఇరువైపులా కేసులు నమోదు చేసినట్లు సీఐ జి.ఇబ్రహీం తెలిపారు. వైఎస్సార్‌సీపీ తరపున సుభాన్‌బాషాతో పాటు మరికొందరు వచ్చి ఫిర్యాదు చేశారు. టీడీపీ నుంచి ఆర్.శ్రీనివాస రెడ్డి, మరికొందరు వచ్చి ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామనీ సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సాయి (ఫైల్)

పీలేరు రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి పీలేరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పీలేరు మండలం కాకులారం పల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన సాయి(40) ద్విచక్ర వాహనంలో పీలేరుకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో చిత్తూరు మార్గంలోని రిలయన్స్ పెట్రోల్‌బంకు వద్ద ఎదురుగా వచ్చి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన సాయిని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

నమో వీరబ్రహ్మేంద్రస్వామి

వైభవంగా ఆరాధనోత్సవాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని వీరబ్రహ్మ క్షేత్రంలో మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజోత్సవాలు మంగళ వారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం తెల్లవారుజామున వీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంతో అభిషేకించారు. ఈ తీర్థంను తీసుకెళ్లి పొలాల్లో పిచికారీ చేస్తే చేస్తే చీడపీడలు తొలగుతాయని రైతుల నమ్మకం. అనంతరం ఉత్సవ మూర్తులకు వస్త్రాలతో అలంకరించి, స్వామి గుణగణాలను కీర్తిస్తూ, సహస్ర నామార్చన జరిపారు.సాయంత్రం వేద పారాయణం చేశారు.

కమనీయం.. శేష వాహనోత్సవం

మంగళవారం రాత్రి శేషవాహనోత్సవం కమనీయంగా సాగింది. ఇందులో భాగంగా మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి పంచ శిరస్సులు గల శేష వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగించారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి వీరశివకుమారస్వామి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ప్రొద్దుటూరు పట్టణంలోని కాలేజ్ రోడ్డుకు చెందిన పేర్ల వెంకటబ్రహ్మానందరెడ్డి, గుంటూరు జిల్లా క్రోసూరుకు చెందిన చేపూరి నరసింహాచారి, విజయలక్ష్మి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి హరికథ కాలక్షేపం భక్తులను అలరించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. దాతలు అన్నదానం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా మఠం అధికారులు సి.శంకర్‌బాలాజి, ఎన్.ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ మఠాధిపతులు వీరభోగవసంత వెంకటేశ్వర స్వామి కుమారులు వెంకటాద్రిస్వామి, భద్రయ్యస్వామి, వీరంబొట్లయ్య స్వామి, దత్తాత్రేయ స్వామి, గోవిందస్వామి, తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మంగారిమఠం



శేషవాహనంపై స్వామి, అమ్మవారు



భక్తులకు ఏర్పాటుచేసిన చలువ పందిర్లు



విద్యుద్దీపాలంకరణలో దేవస్థానం

గతి తప్పిన 'స్లిప్' ప్లాన్

దొంగ ఓటర్లను పంపిన యువకులు

కడప కల్చరల్ : పచ్చ పార్టీ ఎత్తులను అధికారులు చిత్తు చేశారు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత ఓటు వినియోగించుకునేందుకు వచ్చిన వారికి పోలింగ్ అధికారులు ఇచ్చిన స్లిప్ ప్లాన్ గతి తప్పింది. కొందరు యువకులు వాటిని నకలు తీసి మరింతమందిని ఓటు వేసేందుకు పంపడం, ఇది గమనించి పోలీసులు వారిని తరిమివేయడం జరిగిపోయింది. వివరాలిలా ఉన్నాయి.. బళ్లారి రోడ్డులోని ఓ పోలింగ్ కేంద్రంలో పచ్చ పార్టీ రచ్చ చేసింది. ఓటింగ్‌కు ప్రజలు భారీగా తరలి రావడంతో సాయంత్రం 6 గంటల సమయం దాటిపోయింది. దీంతో క్యూలో ఉన్న వారందరికీ పోలింగ్ అధికారులు స్లిప్పులు అందజేశారు. వారంతా రాత్రి ఎంత సమయమైనా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే సమయం గడిచిపోతున్నా క్యూ తరగకపోవడం పోలింగ్ అధికారులు గమనించారు. తాము ఇచ్చిన స్లిప్పుల కంటే ఎక్కువ మంది వస్తున్నట్లు గుర్తించారు. వెంటనే స్లిప్పులను మార్చేశారు. ఇచ్చిన స్లిప్పుల కంటే ఎక్కువ మంది ఓటు వేసేందుకు రావడంతో అధికారులు అనుమతించలేదు. వారంతా తీవ్ర స్థాయిలో వాగ్వివాదానికి దిగి ఒక దశలో దౌర్జన్యానికి సిద్ధమయ్యారు. పోలీసులు, ఇతర పార్టీల నాయకులు ఓటర్ల క్యూ వద్దకు చేరుకుని స్లిప్పులను పరిశీలించారు. ఇచ్చింది వంద స్లిప్పులైతే వచ్చింది 150కి పైగా అని గుర్తించారు. ఇంతకీ జరిగిదేమిటంటే అధికారులు స్లిప్పులు ఇవ్వగానే కొందరు యువత క్యూ నుంచి జారుకొని వారిచ్చిన స్లిప్పులను నకలు తీయించి ఒక్కొక్కరు పది మందికి పంచి పెట్టారు. దొంగ ఓట్లు వేయించేందుకు జనాన్ని సిద్ధం చేశారు. స్లిప్పుల కంటే ఎక్కువ మంది రావడాన్ని గమనించిన పోలింగ్ అధికారులు ఈ స్లిప్పుల వ్యవహారాన్ని గమనించి తనిఖీలు నిర్వహించడంతో విషయం బయటపడింది. దీంతో పోలీసులు దొంగ స్లిప్పులు తెచ్చుకున్న డూప్లి 'కేటుగాళ్ల'ను తరిమివేశారు.

మేనత్తపై కత్తితో మేనల్లుడి దాడి



తీవ్రంగా గాయపడిన మేనత్త సావిత్రమ్మ

మదనపల్లె : ఇంటి ఎదుట కూర్చుని ఉన్న మేనత్తపై అకస్మాత్తుగా మేనల్లుడు కత్తితో దాడి చేసిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. స్థానిక మంజునాథ కాలనీలో నివసిస్తున్న వి.సావిత్రమ్మ(45), శంకర దంపతులు భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ జీవిస్తున్నారు. సావిత్రమ్మకు సోదరులు నాగముని, మధు, సుధాకర్ అక్కడే నివాసం ఉంటున్నారు. పెద్ద తమ్ముడు నాగముని కుమారుడు పి.లోకేష్ (24) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసై జులాయిగా మారాడు. మంగళవారం సంతకు వెళ్లి ఇంటికి వస్తూ సావిత్రమ్మ తమ్ముడు సుధాకర్ ఇంటి వద్ద ఆగింది. మద్యం మత్తులో వచ్చిన మనవడు, పి.లోకేష్ (24) అకస్మాత్తుగా వెంట తెచ్చుకున్న కూరగాయల కత్తితో ఆమెపై దాడి చేశాడు. దాడిలో సావిత్రమ్మ నడుము కింది భాగం, తల మెడ భాగంలో గాయాలయ్యాయి. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు బంధువులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని ఆమెను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగ వైద్యుల చికిత్సతో ప్రాణాపాయం తప్పింది. దాడి చేసిన అనంతరం లోకేష్ తన మేనమామ మధు ఇంటికి వెళ్లి సావిత్రమ్మను కత్తితో పొడిచానని చెప్పాడు. దీంతో అతన్ని ఇంట్లోనే బంధించి గడియ పెట్టారు. లోకేష్‌ను పెళ్లి చేయగా ఆయన భార్య విడిచి వెళ్లిపోయిందని, అప్పటిన ఉంచి సైకోగా మారాడని బంధువులు తెలిపారు. ఘటనపై టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

జమ్మలమడుగు అభ్యర్థులకు భద్రత పెంపు

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ జిల్లా జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం ఆయా అభ్యర్థులకు భద్రత పెంచింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి, టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి అలియాస్ భూపేష్‌కు, బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి సి.ఆదినారాయణ రెడ్డిలకు వ్యక్తిగత భద్రతను 2ప్లస్2 నుంచి 4ప్లస్ 4కు పెంచారు. అలాగే జమ్మలమడుగు నియోజకవర్గంలో ఘర్షణలు, అల్లర్లు సద్దుమణిగేదాకా వీరిని 'హౌస్ అరెస్ట్' చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన మనీష్(26), బొజ్జయ్య (25) ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనులపై కర్ణాటక రాష్ట్రం రాయలపాడుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని చీకలబైలు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



మృతి చెందిన పుష్పరాజ్

చాపాడు : మండలంలోని మొర్రాయిపల్లె గ్రామానికి చెందిన కూలీ మారం పుష్పరాజ్(60) మంగళవారం ఉపాధి పనులు చేస్తూ గుండె పోటుకు గురై మృతి చెందినట్లు ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ఉపాధి పనులు చేస్తుండగా పుష్పరాజ్ నొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు చికిత్స నిమిత్తం మైదుకూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు వివాహితులైన ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పుష్పరాజ్‌కు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఏపీఓ తెలిపారు.

అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి అలంకరించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహావాచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం కార్యక్రమాలు వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం పై అవగాహన పెరగాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్

కడప అర్బన్ : కడప బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులకు 'మధ్య వర్తిత్వం' అంశంపై అవగాహన పెరగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబ ఫకృద్దీన్ అన్నారు. కడప జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో న్యాయవాదులకు మంగళవారం మధ్య వర్తిత్వం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 'మధ్య వర్తిత్వం' అనే ప్రక్రియ వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్దతి అన్నారు. ఖర్చు , సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. మీడియేషన్ యాక్ట్ 2023, సెక్షన్ 6, 320 సిఆర్‌పిసి మొదలైన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.హరిబాబు, ఎం. శాంత, పి.మనోహర్, చంద్రకాంతమ్మ, గుర్రప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా త్రిశూల చక్రస్నానం



త్రిశూలం, చక్రాలకు అభిషేకాలను నిర్వహిస్తున్న అర్చకులు



నదిలో శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వాములకు పూజలు



శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవుని పుష్పయాగం

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు మంగళవారం త్రిశూల, చక్రస్నానం, ధ్వజావరోహణం కార్యక్రమాలతో వైభవంగా ముగిశాయి. పుష్పగిరి గ్రామంలోని వైద్యనాథస్వామి ఆలయం నుంచి కామాక్షీ సహిత వైద్యనాథస్వామి, ఆయన త్రిశూలాన్న ,కొండపైనున్న లక్ష్మీ చెన్నకేశవ ఆలయం నుంచి శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవ స్వామి, ఆయన చక్ర తాళ్వార్‌ను మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య పల్లకిలో మోస్తూ ఊరేగింపుగా పెన్నా నది వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ భక్తులు స్వామి వార్లకు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు, శ్రీనివాసమూర్తిల ఆధ్వర్యంలో త్రిశూలం, సుదర్శన చక్రాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. నదిలో నీరు లేకపోవడంతో ప్రత్యేక గంగా జలంలోకి సమస్త తీర్థాలను ఆవాహన చేసి మహా మంగళ హారతి నిర్వహించారు. పాలు, చందనం, నెయ్యి, పెరుగు, పసుపు, పన్నీరు, కొబ్బరి నీటితో అభిషేకించారు. అనంతరం త్రిశూల, చక్ర తాళ్వార్‌లకు తీర్థవాసి అవబృందోత్సవాన్ని వేద మంత్రోచ్చారణ మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి చక్ర స్నానాలతో బాటుగా స్నానాలు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున కలశాలలో వుంచిన నవ ధాన్యపు మొలకలను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నీటిలో కలిపారు. అనంతరం రెండు ఆలయాల్లో ధ్వజావరోహణం చేసి, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలను ముగించారు. అనంతరం కుంభ సమారోపణ కార్యక్రమాన్ని, హోమాలను నిర్వహించారు.

కన్నుల పండువగా పుష్పయాగం

రాత్రి లక్ష్మీ చెన్నకేశవస్వామికి పుష్పయాగాన్ని కన్నుల పండువగా జరిగింది. వివిధ రకాల పూలతో , వేద మంత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి నిర్వహించిన పుష్పయాగాన్ని భక్తులు తిలకించి పులకించిపోయారు. రాత్రి కామాక్షీ వైద్యనాథ స్వామి, లక్ష్మీ చెన్న కేశవ స్వాములకు తిరుచ్చి వాహన సేవ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ మాడ వీధుల్లో గ్రామోత్సవం జరిపారు.

చక్రస్నాన విశిష్టత

హరి హరుల ఆయుధాలైన త్రిశూల , సుదర్శన చక్రాలకు ఒకే సారి స్నానం నిర్వహించడం పుష్పగిరి ప్రత్యేకత. పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే ఈ ఉత్సవంలో పాల్గొని స్నానాలాచరిస్తే చేసిన పాపాలన్నీ తొలగి పవిత్రంగా మారతారని ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు తెలిపారు. చక్రస్నానం జరిగే సమయంలో స్నానం చేసిన వారికి ముక్కోటి తీర్థాలలో చేసిన స్నానంతో సమానమైన పుణ్యం లభిస్తుందని వేదాలు తెలుపుతున్నాయని ఆయన వివరించారు.